


## 2వ మాట

**రక్షణను ఇచ్చు యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యము:- లూకా 23:43** - అందుకాయన వానితో నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను.

**యేసుక్రీస్తు సిలువలో పలికిన రెండవ మాటను మనం ధ్యానము చేస్తున్నాము. ఈ మాటను ప్రవక్తయైన యెషయా ముందుగానే ప్రవచించాడు.**

**ప్రవచనము: యెషయా 53:12** కావున గొప్పవారితో నేనతనికి పాలు పంచిపెట్టెదను ఘనులతో కలిసి అతడు కొల్లసొమ్ము విభాగించుకొనును. ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను**అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను** అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారినిగూర్చి విజ్ఞాపనముచేసెను. **ఈ ప్రవచనాన్ని యేసయ్య సిలువలో నెరవేర్చుచున్నారు.**

1. **ఇద్దరు దొంగలు ఆయనతో కూడా సిలువ వేయబడ్డారు: లూకా 23:33** వారు కపాలమనబడిన స్థలమునకు వచ్చినప్పుడు అక్కడ కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఆ నేరస్థులను ఆయనతో కూడ సిలువవేసిరి **ఇద్దరు దొంగల మధ్యలో యేసయ్య సిలువ వేయబడ్డారు. ఈ ఇద్దరు వ్యక్తులకు యేసుక్రీస్తుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనిద్దాం. ఎందుకంటే అందరూ ఒకే శిక్షను అనుభవిస్తున్నారు.**

| యేసుతో కూడా సిలువ వేయబడిన వారు | యేసుక్రీస్తు |
|---|---|
| 1. నేరస్థులు : - లూకా23:33 | 1. యేసయ్య ఏ నేరము చేయలేదు:- లూకా23:14 |
| 2. బందిపోటు దొంగలు : - మత్తయి27:38, మార్కు15:27 | 2. యేసయ్యలో ఏ దుష్కార్యము లేదు :- లూకా23:22 |
| 3. అతిక్రమము చేసినవారు:- యెషయ53:12 అక్రమకారులు :- లూకా 22:37 | 3. యేసయ్యలో ఏ దోషము లేదు: - యోహాను19:4 |

**లూకా 23:39 వ్రేలాడ వేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు, నిన్ను నీవు రక్షించు కొనుము, మమ్మును కూడా రక్షించుమని చెప్పెను.**

**ఈ భాగములో యేసయ్యను ఆ నేరస్థులలో ఒకడు దూషించినట్లు వ్రాయబడియుంది. అయితే ఆయనను ఒకడే దూషించాడా? లేక ఇద్దరు దూషించారా అన్న విషయం మనము మిగతా సువార్తలను జాగ్రత్తగా చదివితే అర్థం అవుతుంది.**




2. <u>ఇద్దరూ నిందించారు:</u> **మత్తయి 27:44** - ఆయనతో కూడ సిలువవేయబడిన **బందిపోటుదొంగలును** ఆలాగే ఆయనను నిందించిరి.

**యేసయ్యను ఇద్దరు దొంగలు నిందించినట్లుగా ఇక్కడ గమనించగలము.**

**ఆ ఇద్దరు దొంగలు ఏమని నిందించారు?** వాక్యములో గమనిద్దాం.

**మత్తయి 27:40,42,43**

1. **దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా,**
2. **నిన్ను నీవే రక్షించుకొనుము,**
3. **నీవు దేవుని కుమారుడవైతే సిలువమీద నుండి దిగుము,**
4. **వీడు ఇతరులను రక్షించెను, తన్ను తానే రక్షించుకొనలేడు,**
5. **ఇశ్రాయేలు రాజు గదా,**
6. **ఇప్పుడు సిలువ మీద నుండి దిగిన యెడల నమ్ముదుము,**
7. **వాడు దేవుని యందు విశ్వాసముంచెను, నేను దేవుని కుమారుడనని చెప్పెను, ఆయన కిష్టుడైతే ఇప్పుడు వానిని తప్పించును అని ఆ దారిన పోవుచున్నవారు, శాస్త్రులును, పెద్దలును, ప్రధాన యాజకులును ఆయనను అపహసిస్తూ ఉంటే వారితో పాటుగా ఈ ఇద్దరు దొంగలు కుడా ఆయనను నిందించారు. మొదట ఇద్దరు దొంగలు నిందించినప్పటికీ, రెండవ దొంగ మనసు మార్చుకున్నాడు.**

3. <u>రెండో దొంగ పశ్చాత్తాప పడ్డాడు:</u> **లూకా 23:40,41** - అయితే రెండవవాడు వానిని గద్దించి నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే. మనము చేసినవాటికి తగిన ఫలము పొందు చున్నాము గాని యీయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి

**రెండవ దొంగ మొదటి దొంగను గద్దిస్తున్నాడు. ఒక వ్యక్తి తన లోపములు, తప్పిదములు సరిదిద్దుకున్నప్పుడే ఎదుటి వారు తప్పు చేసినప్పుడు గద్దించగలరు. రెండవ వాడు మొదటి దొంగను గద్దిస్తున్నాడు. నీవు దేవునికి భయపడవా? అని మొదటి వానిని అడుగుతున్నాడు. ఇద్దరికీ మరణ భయము వుంది. కానీ ఇతనిలోకి మరణ సమయములో దైవ భయము వచ్చింది.**

**కీర్తన 19:9 – యెహోవా యందైన భయము పవిత్రమైనది. అది నిత్యము నిలుచును.**

**దేవుని భయము లేని కారణముగా వారు అక్రమకారులుగా, బందిపోటు దొంగలుగా, నేరస్థులుగా మారిపోయారు. ఈరోజు లోకంలో జరుతున్న అన్యాయాలకు, అక్రమాలకు, దోపిడి, దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు గల కారణము దైవభయము మనుష్యులలో లేకపోవడమే అని మనం గ్రహించాలి. ఈ రెండవ దొంగలోకి పవిత్రమైన దైవ భయము వచ్చిన కారణముగా అతని పాపముల నుండి పవిత్ర పరచబడుతున్నాడు.**

**కీర్తన 85:9 – ఆయన రక్షణ ఆయనకు భయపడువారికి సమీపముగా ఉన్నది.**

ఈ రెండవ దొంగలోనికి దైవభయము వచ్చినందు వలన రక్షణ పొందడానికి అతడు ఎంతో దూరములో లేడు, చాలా సమీపములో ఉన్నాడని వాక్యము తెలియజేస్తుంది.

EX:- 1. ఆది 18:15 – శారా దేవునికి భయపడిన తర్వాతనే గర్భఫలం పొందుకుంది.

2. నిర్గమ 1:17,21 – షిఫ్రా, పూయా అను హెబ్రీ మంత్రసానులు దేవునికి భయపడి ఇశ్రాయేలీయుల మగ బిడ్డలను బ్రదుకనిచ్చిన కారణముగా దేవుడు వారికి వంశాభివృద్ధి కలుగజేశాడు.

మనకు దైవ భయము లేకపోతే మనలోకి పరిశుద్ధత రాదు. పరిశుద్ధత లేకపోతే ప్రభువును చూడలేము, పరలోకరాజ్యాన్ని చేరలేమని జ్ఞాపకము చేస్తున్నాను.

**మనకైతే ఇది న్యాయమే:** తాము చేసిన తప్పిదములు జ్ఞాపకము చేసికొని, మనము చేసిన పాపములకు ఈ శిక్ష న్యాయమే అని రెండవ వాడు ఒప్పుకుంటున్నాడు. మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము అని ఒప్పుకుంటున్నాడు. పాపములు కప్పుకునే వారిని దేవుడు క్షమించడు. అవును ఈ లోకములో మనము చేసిన క్రియలకు అవి మంచిపైనా, లేక చెడ్డపైనా వాటికి తగిన జీతము దేవుని యెద్ద మనకు సిద్ధముగా ఉన్నదని హెచ్చరిస్తున్నాను. మనకు న్యాయమే అని ఈ దొంగ చెప్పినప్పుడు యేసుక్రీస్తుకు అన్యాయము జరిగింది అని చెప్పకనే చెబుతున్నాడు.

**ఈయన ఏ తప్పిదము చేయలేదు:** న్యాయము తీర్చవలసిన స్థానములో ఉన్న ప్రధాన యాజకులు, పెద్దలు, పొంతి పిలాతు, అన్యాయపు తీర్పు తీర్చారు. అయితే ఈ రెండవ దొంగ యేసుక్రీస్తుకు న్యాయమైన తీర్పు తీర్చుచున్నాడు.

**ఆయనను చూచి:** యెషయా 45:22 – భూదిగంత నివాసులారా, నావైపు చూచి రక్షణ పొందుడి.

పై లేఖనము ప్రకారము రెండవ దొంగ సిలువలో వ్రేలాడుతున్న యేసు వైపు చూచి రక్షణ అనుభవములోకి వచ్చుచున్నాడు.

4. **యేసూ నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను:** లూకా 23:42 ఆయనను చూచి యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను.

**యేసూ** - యేసు అనగా రక్షకుడని అర్థము. రక్షకున్ని అంగీకరిస్తూ యేసూ… అని పిలుస్తున్నాడు. మొదట నిందించాడు. ఇప్పుడు రక్షకుడని అంగీకరిస్తున్నాడు. మొదటి దొంగకు ఆయన క్రీస్తు అని తెలుసు. అయితే శరీర రక్షణను కోరుకున్నాడు(లూకా 23:39), గాని రెండవ వాడు ఆత్మ రక్షణను కోరుకుంటున్నాడు. శరీరము నిష్ప్రయోజనము. ఆత్మయే శాశ్వతము అని మనము గ్రహించాలి.

- **నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు :-** యేసు క్రీస్తు దేవుని రాజ్యమును గూర్చి ప్రకటించాడు మత్తయి16:28 ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు మనుష్యకుమారుడు తన రాజ్యముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను.

**యేసయ్య "నా రాజ్యము" అని కొన్ని చోట్ల చెప్పారు**

**యోహాను 18:33-36** - పిలాతు తిరిగి అధికారమందిరములో ప్రవేశించి యేసును పిలిపించి యూదుల రాజువు నీవేనా? అని ఆయన నడుగగా. యేసు నీ అంతట నీవే యీ మాట అనుచున్నావా? లేక యితరులు నీతో నన్ను గూర్చి చెప్పిరా? అని అడిగెను. అందుకు పిలాతు నేను యూదుడనా యేమి? నీ స్వజనమును ప్రధానయాజకులును నిన్ను నాకు అప్పగించిరిగదా; నీవేమి చేసితివని అడుగగా. యేసు **నా రాజ్యము** ఈ లోకసంబంధమైనది కాదు **నా రాజ్యము** ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని**నా రాజ్యము** ఇహసంబంధమైనది కాదనెను.

**యేసుక్రీస్తుకు ఒక రాజ్యము ఉందని, ఆయన తన రాజ్యములో వచ్చునని రెండవ వాడు విని, గ్రహించాడు. గనుకనే నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు జ్ఞాపకము చేసికొనుమని అడుగుతున్నాడు.**

- **రెండవ వాడు రాజ్యసువార్త విన్నాడు – అంగీకరించాడు**
- **తను పాపిని అని గ్రహించి - తనపాపములు ఒప్పుకున్నాడు**
- **ఆయన వైపు చూచాడు - యేసుక్రీస్తుని రక్షకుడని అంగీకరించాడు**
- **దేవునికి భయపడ్డాడు – పవిత్రపరచబడ్డాడు**

- **నన్ను జ్ఞాపకము చేసుకొనుము:** **యేసయ్య తన రాజ్యములో వచ్చునప్పుడు ఆయన మనలను జ్ఞాపకము చేసుకొనక పోతే మనకు పరలోక రాజ్యములో చోటు వుండదు. ఆయన మనల్ని తన రాజ్యములో జ్ఞాపకము చేసుకోవాలంటే మనమేమి చేయాలి? మత్తయి 10:32,33 – మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును .**

  **ప్రకటన 3:5 – జయించు వాడు అలాగున తెల్లని వస్త్రములు ధరించుకొనును; జీవగ్రంథములో నుండి అతని పేరెంతమాత్రమును తుడుపు పెట్టక, నా తండ్రి యెదుటను ఆయన దూతల యెదుటను అతని పేరు ఒప్పుకొందును.**

5. **పశ్చాత్తాపపడిన దొంగకు ఆనాడే పరదైసు:** **లూకా 23:43** - అందుకాయన వానితో నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నా ననెను.

   **పరదైసు పరలోకము అనునవి దేవుడు, ఆయన దూతలు, పరిశుద్ధులు, నివసించు ప్రదేశాలు. రెండవ దొంగ తన పాపములు ఒప్పుకొని, పరిశుద్ధపరచబడి పరిశుద్ధులతో కలసి నివసించుటకు యేసుక్రీస్తుతో కుడా పరదైసుకు వెళ్లాడు.**

**మనము మన పాపములు ఒప్పుకొని, విడిచిపెట్టుటకు ఇదే అనుకూల సమయము, ఇదే రక్షణ దినము:**

**2 కొరింథీ 6:2,3** - అనుకూల సమయమందు నీ మొర నాలకించితిని రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడు గదా! ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము.

పశ్చాత్తాపపడిన దొంగతో పరదైసుకు తీసుకువెళతానని వాగ్దానము చేసిన యేసయ్య మనము పశ్చాత్తాపపడితే, మారుమనస్సు పొందితే  మనకు కూడా వాగ్ధానము చేస్తున్నారు. అదేంటంటే?

**జయించు వానికి తండ్రి తో కూడా సింహాసనం:**

**ప్రకటన 3:21 -** నేను జయించి నా తండ్రితో కూడ ఆయన సింహాసనమునందు కూర్చుండి యున్న ప్రకారము జయించువానిని నాతోకూడ నా సింహాసనమునందు కూర్చుండనిచ్చెదను.

**నేడు అనేకులు దేవుని రక్షణను నిర్లక్షము చేస్తున్నారు. సిలువలో దొంగలాగా చనిపోయే ముందు పాపాలు ఒప్పుకుని సుళువుగా పరలోకరాజ్యములో చోటు పొందుదాము అని అనుకుంటున్నారు. సిలువలో దొంగకైనా, మనకైనా దేవుని రక్షణ ప్రణాళిక ఒక్కటే. రెండవ దొంగ వలె మనము కూడా దేవుని రాజ్యసువార్తను, రక్షణ సువార్తను విని, అంగీకరించి, యేసు వైపు చూచి, నోటితో ఆయన రక్షకుడని ఒప్పుకొని, దైవ భయముతో కూడిన పవిత్ర జీవితం జీవిస్తేనే పరలోక రాజ్యము చేరుకోగలము.**

**పశ్చాత్తాపపడిన దొంగకు నాడే మరణం........ నాడే పరదైసు.........**

**మరి నీ మరణం ఎప్పుడు?    నీవు మరణిస్తే ఎక్కడికి వెళ్తావు?**

**ఈ రెండవ మాటలో రక్షణ,విమోచన, ప్రవచన నెరవేర్పు ఉన్నట్లు గ్రహించగలము. పరలోకరాజ్యము చేరుటకు పరిశుద్దాత్మ దేవుడు మనకందరికి సిద్దపాటు అనుగ్రహించును గాక.. ఆమేన్....ఆమేన్....ఆమేన్....**